

# పిలక

పొట్లడుగు వెంకటేశ్వరరావు

కారు ఆ ఇంటిముందు ఆగేసరికి మసగ చీకట్లు కమ్ముకుంటున్నయ్.

ప్రశాంతంగా వున్న వాతావరణంలో ఇల్లు నిల్లగా మసక మసగ్గా అవుపిస్తున్నది.

ఉక్కగావుంది. గాలి ఆడటంలేదు.

లోపలికి వెళ్ళిన డ్రయివరు తిరిగివచ్చి కారు డోరు తెరిచాడు.

''మోహన్'గారు ఇంట్లో లేరటండి. అమ్మగారున్నారు. రండి.' అన్నాడు డ్రయివరు.

మూర్తి కారుదిగి మెల్లగా నడిచి లోపలికి వెళ్ళాడు.

హాలులో లాంతరు వెలుగుతున్నది; గుడ్డిగా.

కుర్చీలో కూర్చుని ఇంటిని పరిశీలనగా చూశాడు మూర్తి.

గోడలని ఒకటి రెండు దేవుళ్ళ ఫోటోలు వేళ్ళాడుతున్నాయి. గుమ్మంపైన పెద్ద వెంకటేశ్వరస్వామి ఫోటో లాంతరు వెలుతురులో కొట్టొచ్చినట్టు అవుపిస్తున్నది.

తలుపు వెనకాల గాజులు చప్పుడయింది.

'అబ్బాయి పనిమీద వూళ్ళోకి వెళ్ళాడు.'

'అవునట. డ్రయివరు చెప్పాడు. నా పేరు మూర్తి అండి. వ్యాపారం వుంది రెండు మూడు మేడలున్నయి. యాభై ఎకరాలదాకా మాగాణివుంది. అరుంధతి నాకు మేనకోడలు అవుతుంది. నా తర్వాత ఆ ఆస్తిఅంతా అమ్మాయిదే'మూర్తి చెప్పాడు.

'అరుంధతా?'

'అవును. అరుంధతి మీకు తెలిసే వుంటుంది.'

ఆమెనించి మాటకోసం నిరీక్షించాడు మూర్తి. సమాధానం రాకపోయేసరికి తనే అన్నాడు తిరిగి.

'ఈ మధ్యన వ్యాపారంగురించి నేను అయిదారు నెలలుగా 'నార్త్ ఇండియా'లో వుండిపోయాను. మోహన్‌ని నేను ఇంతవరకూ చూడలేదు. అయినా మావాళ్ళు చెప్పిన మాటలనిబట్టి అబ్బాయి బుద్ధిమంతుడని తెలిసింది అందుకే మీతోనూ, మోహన్ నాన్నగారితోనూ మాట్లాడుదామని వచ్చాను.'

'వియ్యానికయినా, కయ్యానికయినా సమానత్వం వుండాలంటారు' అందామె.

'ఏ దృష్టితో చూసినా మేము మీతో తూగలేము. రాధమ్మగారన్నట్టు దేనికయినా అర్హత వుండాలిగదా!' అందామే తిరిగి.

మూర్తి కలవరపడ్డాడు. ఆ మాటలు ఆందోళన కలిగించినయ్, మూర్తికి.

'అయితే మోహన్ మీకు అన్నీ వివరంగా చెప్పేడన్నమాట. నావని మరింత నులువయింది. మా రాధమ్మ కొంచెం నోటి దురుసు మనిషి. ఆమె మాటలు మీరు పట్టించుకోవద్దు. ఇటువంటి విష విషయాల్లో పిల్లల ఇష్టసుఖాలకి ప్రాముఖ్యం ఇవ్వాలిగాని మాట పట్టింపు

మీద కూర్చోటం మంచిదికాదు. మీరూ తెలిసినవారు. నేనంతగా చెప్పాల్సిన పని లేదనుకుంటాను.'

'అవుననుకోండి అద్దాన్ని విసిరేసే ముందు ఆలోచనవుండాలిగాని తీరా అంతా అయిపోయాక అతికిద్దామంటే కుదుర్తుందా అని.'

'మీరన్నమాట నిజమే. తొందరపాటు వలన జీవితాలు ఎండమావులుగా మారిపోవటం నాకూ బాగా తెలుసు. ఆ విషయంలో మా రాధమ్మది పొరపాటేనని నేను ఒప్పుకుంటాను. ఇప్పుడామె పశ్చాత్తాపంతో కృంగిపోతున్నది. అరుంధతి పరిస్థితి భయంకరంగా వుంది ఇది నిండు జీవితానికి సంబంధించిన సమస్య. అందుకే బ్రతిమాలుకుందామని వచ్చాను. మోహన్ నాన్నగారు వూళ్లో వున్నారా?'

మూర్తి ప్రశ్నకి మౌనమే సమాధానమయింది.

కొన్ని నిముషాల తరవాత ఆమె ముక్కు చీదుకున్న శబ్దం వినిపించింది.

'క్షమించండి. నా ప్రశ్న మిమ్మల్ని ఇంత బాధ పెడ్తుందని నే నూహించలేదు. అనాలోచితంగా మీకు వ్యధకలిగించాను. అరుంధతి గురించి 'వారి'తోకూడా మాట్లాడుదా మనుకున్నానంతే'

'ఫర్వాలేదులెండి. మోహన్ నా ఒక్కగానొక్క సంతానం. ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుని బతికాను. మొండిగా అయిన నా జీవితంలో మోహనే ఆశాకిరణం. వాణ్ణి పైకి తీసుకురావటానికే నా బ్రతుకంతా వెచ్చించి బాధని దిగమింగుకున్నాను.'

'అవును. ఏ తల్లిమాత్రం అంతకంటె ఇంకేమి కోరుకుంటుంది?'

'అయినా అప్పుడప్పుడు కొన్ని విషమ సమస్యలు ఎదురవకపోలేదు 'అమ్మా నాన్న ఏడి? నా చిన్నప్పుడే చచ్చిపోయారా?' అని మోహన్ అడిగితే అవుననలేక కాదనలేక కుమిలిపోయాను ఈ నాటికీ అది మోహన్‌కి సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోయింది. జీవితంలో ఎంత చేదుని దిగమింగిన నాకు అరుంధతి పరిస్థితిని అర్థం చేసుకోటం అంత కష్టమనిపించలేదు'

'అవునండి ఆ ఆశతోనే పనిగట్టుకుని వచ్చాను. అరుంధతి నా ప్రాణం. చిట్టితల్లి కొంచెం బాధపడితే చూడలేకపోయే వాడిని. ఈనాడు అరుంధతిని చూస్తే నాకడుపు తరుక్కుపోతూంది. నా బాధ మీరు అర్థంచేసుకోగల రనుకుంటాను.'

'పరిస్థితి ఇంత తీవ్రమయిందని నే నూహించలేదు, ఏ సంగతీ తెలుసుకుంటానికిగాని, చెప్పటానికిగాని ఈమధ్యన మోహన్ ఇంటిపట్టున వుండటంలేదు. ఎంతసేపూ పనిమీద తిరుగుతున్నా నంటాడు. మోహన్ ఈ మధ్యన చిత్రంగా మారిపోయాడు.'

'ఈ సమస్యకి పరిష్కారం మీ చేతుల్లో పెడుతున్నానండి. అరుంధతి ఇప్పటికే సగం చచ్చిపోయింది. అరుంధతితోపాటే మా జీవితాలూ. మిమ్మల్ని బ్రతిమాలుకుంటాను. మోహన్ రాగానే ఒక్కసారి పంపించండి. అదే నే కోరుకునేది. మరి నే వెళ్లివస్తానండి.'

'ఉండండి.'

ఆమె లోపలికివెళ్లి రెండు నిముషాలలో గ్లాసు పట్టుకొచ్చింది.

'ఈ మజ్జిగ తీసుకోండి. ఈ స్థితిలో మేము చేయగల సత్కారం ఇదే.'

'అంతమాట అనకమ్మా.' గ్లాసుతీసుకుని మజ్జిగ తాగుతూ ఆమెని ఓ క్షణంపాటు చూశాడు మూర్తి.

మరుక్షణం వులికిపడ్డాడు!

మసగ వెల్తురులో ఆమె ఆకృతి అస్పష్టంగా వుంది.

కాని...అదే పోలిక! వయస్సు మనిషిలో మార్పు తెచ్చినా, ఆమె నిలుచున్న తీరు ఎక్కడో చూసినట్లుంది. ఆమె కదలిక పరిచిత మయినదిగా అన్పించింది.

మూర్తి నోటివరకూ మాట వచ్చింది. బలవంతం మీద ఆపుకున్నాడు.

ఏమో! మనిషిని పోలిన మనుషుండవచ్చు. అయినా ముప్పయ్యేళ్ళ క్రితం సంగతి. మనసులో అణిగిన ఆస్మృతి! ఆ తలపులు రాగానే తనకి అట్లా అన్పించిందేమో! ఒకవేళ తను భ్రమపడ్తున్నాడేమో! వయస్సుతోపాటు సన్నగిల్లిన చూపు తనను మోసం చేస్తున్నదేమో!

మూర్తి చేతులు వణికాయ్. గ్లాసు కింద పెట్టాడు.

తడబడే అడుగులతో లేచి నిలబడ్డాడు.

మరి వస్తానండి. అబ్బాయిని ఒప్పించే భారం మీది. నేను మళ్ళీ ఒకసారి వస్తాను. ఈలోగా మోహన్‌వస్తే మా ఇంటికి పంపించండి.'

మూర్తి బయటికి వచ్చాడు.

కారులో కూర్చున్నా మూర్తి వణుకు తగ్గలేదు.

వెండిమీసాలమాటున పెదాలు అదుర్తున్నాయ్.

కారు కదిలి చల్లగా గాలి తగిలింది.

మూర్తి కనులముందు అదే దృశ్యం పొరాడింది. ఆ నిలబడిన తీరు! ఆ అడుగుల వరుస!! ఏనాటి జ్ఞాపకం అది!

అవును.

శోభనం నాటిరాత్రి... అవే కదలికలు శ్యామలలో గమనించి ముగ్ధుడయ్యాడు మూర్తి. సుమారు మూడుదశాబ్దాల క్రితం. ఆ వన్నెచిన్నెలు ఆకర్షించి ఆ కట్టుకున్నయ్, మూర్తిని. శ్యామలని భార్యగా పొందినందుకు ఎంతో ఆనందించాడు.

కాని...ఆ కలలు వెంటనే కరిగిపోయాయి.

చిన్న విషయంమీద పెద్దలకి గొడవ వచ్చింది. అది చిలికి చిలికి గాలివాన అయింది. పట్టింపులు పంతాలయి పెద్దల చిన్నబుద్ధులు వక్రమార్గాన విజృంభించేయి.

ఆవేశం మనిషిని ఆలోచింపనియదు—విషయంయొక్క పూర్వాపరాలని గుర్తింపచేయదు.

మాటమీద మాటవచ్చింది అదుపుతప్పిన మాటలతో మనస్సులు విరిగేయి. బంధాలు విచ్ఛిన్నమయ్యాయి.

అంత తేలిగ్గా విడదీశారు, పెద్దలు నూరేళ్ళ అనుబంధాన్ని!

వాక్కు మహత్తరమయిన శక్తిగలది. అమృతం కురిపించినా, లేక విషం వెదజల్లినా మనిషి వాలికకే తగును. ఆ విషపు జల్లు మూర్తిమీదకూడా పడింది.

మూర్ఖతనం. వేడిరక్తం.

ఆ పొంగులో, ఉద్రేకంలో...కట్టుకున్న భార్య కన్నీటిని గురించి అప్పుడు ఆలోచించలేదు మూర్తి. మాటమీద నిలబడ్డాడు.

'ఇంత లేని వాళ్ళనుకోలేదు. కాకిముక్కుకి దొండపండులా ఆ కొండముచ్చుకి కట్టబెట్టాని గొంతుకోశారు.' మంగళకరమయిన

సమయంలో అప్రయత్నంగానే 'ఒకనాటి' వెంటవచ్చిన ఆ మాటలు ప్రళయాన్నే సృష్టించేయి. ఎన్నో ఆశలతో ఎదురు చూసిన భవిష్యత్తు చీకటిలో మునిగిపోయింది

ఆ చీకటినే వరించాడు మూర్తి.

అందులోనే సాహసంతో ప్రయాణించి జీవితంలో రెండువంతులు నెట్టివేశాడు.

పట్టుదలతో ప్రయత్నించి ఈనాటికి ఒకస్థాయికి చేరుకున్నాడు. ఎప్పుడయినా, శ్యామల తలపులు మనసులో కలక వేసినా పట్టుదలగా అణగద్రొక్కి మొండితనం తెచ్చుకున్నాడు.

ఆ శ్యామల ఏమయింది? అందులో శ్యామల తప్ప ఏమయినా వున్నదా?—అన్న ఆలోచనే మనసులోకి రాకుండా తుడిచేసాడు.

విడిపోయిన దారులు కలుసుకోవు. ఆడ దానికే అంత పట్టుదలయితే మగవాడు ఎందుకు తల ఒగ్గాలి?

'బాబుగారూ! ఇంటికెళదామా?'

డ్రయివరు మాటతో వులికిపడి ఈ ప్రపంచంలో పడ్డాడు మూర్తి.

'వద్దులే. 'క్లబ్బు'కి పోనీ.' కారు 'క్లబ్బు'వయిపు దూసుకుపోయింది.

మూర్తి మనస్సు ఇంటిని తల్చుకుని ముడుచుకు పోయింది.

ఆ స్థితిలో అరుంధతిని తను చూడ లేడు.

అరుంధతి ఎంత మారిపోయింది! లోతుకుపోయిన అరుంధతి కళ్ళు పిచ్చిగా తననే చూస్తాయి. ఆ చూపు నిర్జీవంగా తన గుండెల్ని చీలుస్తుంది. ఆ బాధ తను భరించలేడు. అరుంధతి చూపు దీనంగా, ప్రార్థిస్తూ, మనసుని ముక్కలు చేస్తూ.

అరుంధతి ఎట్లా అయిపోయింది?

తను ఢిల్లీ వెళ్ళే ముందు ఎంత హుషారుగా వీడ్కోలు చెప్పిందరుంధతి!

ఆ చలాకీ తనం ఏమయింది?

అరుంధతి చిన్నప్పుడే రాధమ్మ భర్త పోయాడు. తనకీ వెనకా ముందూ ఎవరూ లేక పోవటంవలన వాళ్ళని తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు.

ఎడారివంటి తన బ్రతుకులో అరుంధతి అమృతపు జల్లు కురిపించింది.

ఆ పిల్లని గుండెమీద పెట్టుకొని ఆడుకునేవాడు తను. చిన్న అరుంధతి వచ్చీ రాని మాటలు, చిట్టి చిట్టి అడుగులు తనకింకా జ్ఞాపకం.

అరుంధతిని తన చేతుల్తో పెంచాడు. ఆ పిల్ల నవ్వితే తన గుండెలు పొంగేటట్టు నవ్వాడు. అరుంధతి ఏడిస్తే తన కనులు చెమర్చేవి.

అరుంధతిని తన ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నాడు. ఆశలన్నీ అరుంధతిమీదే నిలుపుకున్నాడు.

అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశాడు.

పువ్వులా పెరిగింది.

సువాసనలు వెదజల్లింది.


తన బ్రతుకులో వెన్నెలు కురిపించింది అరుంధతి

'అరుంధతీ! అరుంధతీ' అని పిలిచేవాడు ఆఫీసునుంచి రాగానే. చిలిపిగా దాక్కునేది. కాసేపు ఏడిపించి 'ఏమిటి మామయ్యా?' అంటూ ప్రత్యక్ష మయేది. అంతలోనే ఏడ్పించి అంతలోనే నవ్వించి పిచ్చాడిని చేసేది.

తను ఢిల్లీ వెళ్ళేప్పుడు పెద్ద గులాబీ దండ తెప్పించి తన మెడలో వేసింది. 'క్షేమంగా వెళ్ళి లాభంగా రావాలి. తొందరగా రావాలి' అంది. ఆ మాట అంటున్నప్పుడు అరుంధతి కళ్ళు తడిగా అవటం తను గమనించాడు.

'పిచ్చితల్లీ! ఆ మాట నువ్వు చెప్పాలా? నా ప్రాణాలన్నీ ఇక్కడే వుంటాయి' అన్నాడు తను బొంగురుగా.

'డబ్బు సంపాదన' అన్న ధ్యేయం మనిషి జీవితాన్ని తినేస్తుంది వ్యాపార వ్యవహారాలు సాలెగూడు లాంటివి. ఆ ఒడు దుడుకులన్నిట్నీ తట్టుకుని ఒకదార్ని పెట్టే




'సార్, ఈ సినిమాలో ఆఖరికి ఎవర్ని చచ్చిపోతారంటారా? ప్రేక్షకులేనని వేరే చెప్పక్కర్లేదు...'

ప్పటికి అదిగో ఇదుగో అంటే ఆర్నెల్లు పట్టింది.

అరుంధతి వుత్తరాలు రాసేది.

ఆ వుత్తరాలు వుషారుగా వుత్తేజంతో వుండేవి.

నువ్వు త్వరగా రా మామయ్యా. నీకో శుభవార్త చెబుతాను' అని వూరించేది.

ఉన్నట్టుండి అరుంధతి వుత్తరాలు ఆగిపోయేయి.

తను కంగారుపడి వ్యవహారాలు తొరగా తెముల్చుకుని వచ్చేశాడు. ఎంతగానో ఎదురు చూసిన తన కళ్ళకి ఎవరూ స్వాగతం చెప్ప టానికి కనపడలేదు అరుంధతికోసం ఢిల్లీ నుంచి ఎన్నో కొని తెచ్చేడు తను. వాటిని అందుకోటానికి అరుంధతి రాలేదు.

ఇంట్లో దిగులుపడిన మొహంతో రాధమ్మ ఎదురయింది.

'అన్నయ్యా!' అని మొహం కప్పుకుని బావురుమంది.

అరుంధతికి జ్వరం. పక్కమీంచి లేవటం లేదు. పెద్ద డాక్టర్లని పిలిపించాడు.

'ఇది మనోవ్యాధి. అమ్మాయి మనస్సు కీ వవేదనకి గురయింది. అదేదో తెల్సుకోన టానికి ప్రయత్నించండి. తెలుసుకుని ఆ కోరికని తీర్చటం తప్ప మార్గాంతరం లేదు' అన్నారు డాక్టర్లు.

రాధమ్మ బయటపెట్టిందప్పుడు.

'ఎవరో మోహనుట. అమ్మాయి అత నితో తిరుగుతూందని నాకు తెల్సింది. కుఃరాడుగురించి మన డ్రయివరు ద్వారా విచారించాను. బుద్ధిమంతుడేనట. ఏదో వుద్యోగం చేస్తున్నాడట. పెద్దగా ఆస్తి పాస్తులు లేవట. అతని తల్లిని తండ్రి విడిచిపెట్టేడట అందుకే నాకు నచ్చలేదు. అరుంధతికి చెప్పి చూశాను. కాని నామాట విన్పించుకోలేదు.

ఒకరోజు నేను ఎదురుచూసిన సమయం వచ్చింది అతను అరుంధతికోసం వచ్చాడు. అరుంధతి ఆ సమయంలో ఇంట్లోలేదు.

అతన్నికూర్చోపెట్టి, తీరికగా నాలుగూ కడిగేశాను. 'నీ అంతస్తెంత? అరుంధతి వెంట తిరగటానికి నీ అర్హత ఏమిటి? లక్షలకొద్దీ ఆస్తి వుందనేగా నీ ఆలోచన? అందుకోసమేగా నీ ప్రయత్నం? ఇదుగో చెప్తున్నాను. బుద్ధిగలవాడివయితే ఇప్పటి కయినా జ్ఞానం తెచ్చుకో. నీదార్ని నువ్వు నడిచి నీకు తగిన పిల్లనిచేసుకో. నువ్వు మా అరుంధతికి తగవు. అది చిన్న పిల్ల. ఒకవేళ దాన్ని వలలో వేసుకుందామని ప్రయత్నించినా నీ ఆటలు సాగవు' అంటూ దులిపేశాను.

అతనేదో చెప్పబోయాడు. నేను విన దల్చుకోలేదు. అతని మాటని విన్పించుకో లేదసలు. మొహం ఎర్రగాచేసుకుని వెళ్ళి పోయాడు. పీడా విరగడయిందని సంతో షించాను. ఆ తర్వాత అతను మరి కన పడలేదు.'

మూర్తి మౌనంగా వింటుండిపోయాడు.

'అది జరిగిన మూడోనాటినుంచీ అరుం ధతి ధోరణి మారిపోయింది. అన్నం తినదు. నీళ్ళు తాగదు. గదిలో తలుపేసుకుని వుండి పోయేది. నాకు కంగారేసి బెంబేలెత్తి పోయాను. ఆ తర్వాత మంచం పట్టింది. ఎట్లాంటి మనిషి ఎట్లా అయిపోయిందో! నువ్వు చెప్పన్నయ్యా. ఇందులో నా తప్పే మయినా వుందంటావా?' అని శోకాలు తీసింది రాధమ్మ.

మూర్తికి ఆమె ఓదార్చటానికి మాటలు రాలేదు.

తర్వాత లేడీ డాక్టరు చెప్పింది. అరుం ధతి గర్భవతట!

కారు ఆగింది.

క్లబ్బులో లయిట్లు వెలుగుతున్నాయి. వెనక 'లాంజి'లో హడావుడిగా వుంది.

'హలో! మూర్తిగారూ! సమయానికి వచ్చారు రండి.' కంట్రాక్టరు కాశీపతి ఆహ్వానించాడు.

'మా ఫ్రెండు ఒకాయనకి హైద్రాబాదు ట్రాన్స్ఫరయింది. ఆ సందర్భంగా 'పార్టీ' ఏర్పాటు చేశాము' అంటూ చెయ్యిపట్టు కుని తీసుకువెళ్ళాడు కాశీపతి.

పార్టీ అప్పుడే మొదలయింది. సందడిగా వుంది.

'హలో! మోహన్! వీరు మూర్తిగారు 'బిజినెస్ మన్' లక్షల వ్యాపారం ఈ వూరి ప్రముఖుల్లో ఒకరు. మన క్లబ్బుకి ఆనరరీ ప్రెసిడెంట్. ఇతనేనండి హైదాబాదు ట్రాన్స్ఫరయి వెళ్తున్నది.' పరిచయం చేశాడు కాశీపతి.

నమస్కారాలయేయి.



FDS AG 1659 TEL

అతన్ని పరీక్షగా చూశాడు మూర్తి. ఆ కళ్ళు, ముక్కు, మొహం పరిచితమయినట్టుగావుంది. అతన్ని ఎక్కడో తను ఎరుగును. ఆ నవ్వు తనకి బాగా గుర్తుంది.

## పోలిక

జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నించాడు మూర్తి.

పార్టీ జరుగుతున్నంతసేపూ కుర్చీలో కూర్చుని ఎంతో ప్రయత్నించాడు; గుర్తు తెచ్చుకోటానికి. ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది.

పార్టీ అయిపోయింది.

అందరూ వెళ్ళిపోతున్నారు.

'నా కారులో డ్రాపుచేస్తాను రండి' కాశీపతి ఆహ్వానించాడు.

'అవసరంలేదు కారులోనే వచ్చాను.' మూర్తి ఆలోచనల్తొంచి బయటపడ్డాడు.

అరుంధతి కలవరించింది రాత్రంతా. కళ్ళలో వత్తులు వేసుకుని మంచం ప్రక్కనే కూర్చుండి పోయాడు మూర్తి. కళ్ళు ఎర్రగా అయి మంటలు పెడుతున్నాయి. స్నానంచేసి మోహన్ ఇంటికెళ్దామని బట్టలు వేసుకున్నాడు.

అద్దంముందు కూర్చుని తలదువ్వుకుంటూండగా చటుక్కున ఒక ఆలోచన మెరిసింది!

రాత్రి క్లబ్బులో గుర్తుకి తెచ్చుకోవటానికి తను చేసిన ప్రయత్నం తలపుకి వచ్చింది 'అతని' ముక్కు, కళ్ళు, మొహం, ఎవరి పోలికలో తెలిసినట్టయి మనసులో ఆనందం తళుక్కున మెరిసింది. అద్దంలో పదేపదే చూసుకుని పోల్చుకున్నాడు.

పార్టీ హడావుడిలో రాత్రి 'అతన్తో' మాట్లాడటం కుదరలేదు.

ఆ మొహంలో రేఖలు, చూపుల్లో పట్టుదల, కళ్ళలో వెలుగు...అంతా... అంతా తన పోలికే!

అయితే 'ఆమె'...శ్యామలేనా?

అదే నిజమయితే ఎంతదృష్టం! మూర్తి గుండెలు ఆనందంగా పురకలు వేశాయ్. ఉత్సాహంగా కిందికి దిగివచ్చాడు.

డ్రయివరు హాలులో అతనికోసం ఎదురు చూస్తూ నిలబడి వున్నాడు.

'అయ్యగారూ!'

'కారు రడీయేనా? తొందరగా వెళ్ళాలి.' 'టై' కట్టుకుంటూ అన్నాడు మూర్తి.

'ఈ ఉత్తరం 'వారి'చ్చారయ్యా'

'ఎవరోయ్?'

'పెట్రోలు కొట్టించుకున్నాక, దారే గదా, మోహన్ బాబుగారున్నారేమో చూసి వద్దామని వారింటికి వెళ్ళాను బాబూ!'

'ఉన్నాడా?' ఆత్రుతగా అడిగాడు మూర్తి.

'ఉన్నారయ్యా, తల్లీ కొడుకులు ప్రయాణానికి సిద్ధంగా వున్నారు.

నన్ను చూసి అమ్మగారు పలకరించారు. మోహన్‌బాబుకి బదిలీ అయిందట. వెళ్ళిపోతున్నారట! అమ్మగారు మీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఉత్తరం మీకు ఇమ్మని చెప్పి నాకు ఇచ్చి వెళ్ళిపోయారు. స్టేషనుకి కార్లో తీసికెళ్తానని ఎంత చెప్పినా వినలేదు, బాబూ!'

మూర్తి కంగారుగా వుత్తరం చించాడు.

అతని కళ్ళు అక్షరాల వెంట పరుగులు తీశాయ్.

'రాత్రి మిమ్మల్ని.. నేను గుర్తుపట్టాను; మీరే నన్ను గుర్తించలేకపోయారు. నామీద దయలేదు మీకు. అంతా దురదృష్టమనుకుంటున్నాను. మళ్ళీ మిమ్మల్ని కళ్ళారా చూసుకున్నందుకు, ఆ భాగ్యం నాకు కలిగించినందుకు కరుణామయుడయిన భగవంతునికి కృతజ్ఞతతో మొక్కుకున్నాను. ఈ జీవితానికిది చాలు. 'ఆ విషయ'ంలో మోహన్‌కి ఎన్నోవిధాల చెప్పి చూశాను. బ్రతిమాలాను. కంట తడిపెట్టాను.

అయితే అతడు నా మాట వినిపించుకోలేదు. కావాలని బదిలీ చేయించుకున్నాడట!

ఆ పట్టుదల. మొండితనం చూసి మీరు జ్ఞాపకానికివచ్చారు. మోహన్ మీ కొడుకు. అందుకేనేమో నామాట వాడి వద్ద చెల్లుబాటుకాలేదు. ఒకొక్కప్పుడు ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితి. బహుశా భగవంతుడు ఆడదానికిచ్చిన శాపమేమో! కన్నీళ్ళతో సెలవు తీసుకోవటం తప్ప ఇంకేం చెయ్యగలను? — శ్యామల.'

వణికే గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ, చావని ఆశ వెంటాడుతూండగా గబగబా కారెక్కాడు మూర్తి.

కారు స్టేషనువయిపు దూసుకుపోయింది.

ఒగురుస్తూ ప్లాటుఫారం చేరిన మూర్తి అప్పుడే స్టేషను వదిలిపోతున్న రైలుని చూసి నిస్సత్తువగా ఆగిపోయాడు.

మలుపు తిరిగి రైలు అదృశ్యమయింది.

మూర్తి కనులలో నీరు నిండి చంపల మీదుగా కిందికి జారింది. ●


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
– శస్త్రచికిత్స
అవసరములేదు!
Bensons-2141-TEL

సంపూర్ణ ఆరోగ్యం
పొందండి



గ్రస్త్రీయ పద్ధతి శస్త్రచికిత్స లేకుండా పూర్తి ఆరోగ్యాన్ని పొందుటకు సెక్స్ స్పెషలిస్టును సంప్రదించండి. (20 సంవత్సరాల అనుభవం.)

డా॥ రాయ్ (గవర్నమెంటు రిజిష్టర్డు)
వీరసము నరముల బలహీనత చికిత్సద్వారా నయం చేసుకొని మీ వైవాహిక జీవితాన్ని సుఖవంతం చేసుకోండి. నరముల బలహీనతను మందులద్వారానేకాక ఎలక్ట్రిక్ చికిత్సలవల్ల కూడా నయం చేయబడును.

సంప్రదించు వేళలు ఉ॥ 8-00నుండి1-00 గంట సా॥ 4—00 నుండి రాత్రి 9—30 వరకు.

రాయ్ మెడికల్ హాల్
బ్రాంచి ఆఫీసు : మొదటి అంతస్తు,
గాంధినగరం. (అలంకార్ టాకీస్ ఎదుట.)
విజయవాడ—3.
హెడ్ ఆఫీసు: మొదటి అంతస్తు,
సెయింట్ మేరీ రోడ్ (మనోహర టాకీస్‌వద్ద)
సికింద్రాబాద్ (ఫోను: 72184).